4
వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
మంగళవారం, ఆగస్టు 11, 2026

# సంగారెడ్డిలో లక్ష మందితో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జగ్గారెడ్డి
- సభ ఏర్పాట్లపై సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష
- వేదికపైనే లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్** : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న సంగారెడ్డిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బహిరంగ సభను సుమారు లక్ష మందితో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. సంగారెడ్డి సీఎం బహిరంగ సభ ఏర్పాట్లపై మంగళవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, మంత్రి దామోదర రాజనర్సింహ వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండటం వల్ల ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు. ఈ సందర్భంగా సభకు భారీ జన సమీకరణ, వేదిక ఏర్పాట్లు, భద్రత తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి సంగారెడ్డికి చేరుకుంటారని, సాయంత్రం 4 గంటల వరకు అక్కడే అందుబాటులో ఉంటారని నేతలు వెల్లడించారు. ఈ భారీ బహిరంగ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని మంత్రి ఉత్తమ్, జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి ఒక్కో నియోజకవర్గం చొప్పున.. మొత్తం 10 మంది లబ్ధిదారులకు సీఎం రేవంత్ రెడ్డి సభా వేదికపైనే స్వయంగా కొత్త 'స్మార్ట్ రేషన్ కార్డులను' అందజేస్తారని మంత్రి తెలిపారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ఆదేశించారు. సభకు వచ్చే జనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.




# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేసే కుట్రను అడ్డుకోవాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కష్టపడి సాధించిన నీటి ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసేందుకు జరుగుతున్న కుట్రలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనుమతులు ఇచ్చిన ఏడు తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరుతుండగా, ఆ అంశాన్ని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండాలో చేర్చడం అత్యంత దారుణమని మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ఈ సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం అనుమతులు ఇచ్చిన తర్వాత వాటిని రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం పట్టుబడుతుంటే, అదే అంశాన్ని కేంద్రం ఆధీనంలోని జీఆర్ఎంబీ అజెండాలో పెట్టడం ఎంతవరకు సమంజసమని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆత్మగౌరవం ఉంటే వెంటనే సమావేశాన్ని బహిష్కరించాలని, ఏడు ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాన్ని అజెండా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా దీనిపై స్పష్టమైన సమాధానం చెప్పాలని కోరారు. జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించడంతో పాటు అజెండా నుంచి అనుమతుల రద్దు అంశాన్ని తొలగించకపోతే తెలంగాణలో ఉధృతమైన జల ఉద్యమాన్ని నిర్మిస్తామని కేటీఆర్ హెచ్చరించారు. అవసరమైతే జలసౌధను ముట్టడిస్తామని, తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ముందుండి పోరాడుతుందని తేల్చిచెప్పారు.తెలంగాణకు చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీల వైఖరి చూస్తుంటే "8 + 8 = 0" అని తాము ఊరికే అనలేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు గెలిచినా తెలంగాణ ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో ఒక్కరు కూడా గట్టిగా మాట్లాడటం లేదని విమర్శించారు. కేంద్రం కెన్–బెత్వా, పోలవరం, అప్పర్ భద్ర ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇస్తుండగా, తెలంగాణలోని పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వబోమని పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పినా ఒక్క తెలంగాణ ఎంపీ కూడా నిలదీయలేకపోయారన్నారు. ఇదిలా ఉంటే, పంప్‌హౌస్‌లను ఆన్ చేసి రైతులకు నీరు అందించకుండా ప్రభుత్వం కేవలం యాగాల పేరుతో ప్రజల దృష్టిని మళ్లిస్తోందని కేటీఆర్ విమర్శించారు. నార్లాపూర్, కన్నెపల్లి పంపులను వెంటనే ఆన్ చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. "వరుణ యాగాలు చేయడంలో తప్పులేదు. కానీ యాగంతో పాటు చేయాల్సిన పని కూడా చేయాలి. దైవ ఆశీర్వాదానికి మానవ ప్రయత్నం తోడవాలి" అని కేటీఆర్ హితవు పలికారు.

# వేములవాడలో అఖిలాండ శక్తి స్వరూపిణులు

- మన పట్టణంలో కొలువుదీరడం ప్రజల అదృష్టం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఘనంగా ఆషాఢ బోనాల జాతర మహోత్సవాలు

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్** : ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ప్రతినిత్యం అమ్మవార్ల ఆరాధనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువుదీరిన శ్రీ ఉజ్జయిని మహంకాళి, శ్రీ ప్రత్యంగిరా, శ్రీ భగలాముఖి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవార్ల దివ్య ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆషాఢ మాసం ప్రజలందరికీ అత్యంత పవిత్రమైన మాసమని, ఈ బోనాల జాతరలో అమ్మవార్లను దర్శించుకోవడం తాను చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. శ్రీ ఉజ్జయిని మహంకాళి, ప్రత్యంగిరా, భగలాముఖి అమ్మవార్లు ఒకే చోట కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వడం వేములవాడ ప్రజల పూర్వజన్మ సుకృతమన్నారు. అఖిలాండ శక్తి స్వరూపిణులైన అమ్మవార్ల కరుణాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అమ్మవార్ల దయతో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతులు సంతోషంగా జీవించాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు చెప్పారు. ఆషాఢ మాసం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బోనాల జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీని ప్రభుత్వ విప్ ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా ఆలయ కమిటీ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్‌ను అభినందిస్తూ.. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కల్పనలో కమిటీ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ తుమ్ మధు, కౌన్సిలర్లు తోట రాజు, కొండ శేఖర్, అన్నారం శ్రీనివాస్, కుమ్మరి శ్రీనివాస్; కాంగ్రెస్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, నాగుల విష్ణు ప్రసాద్, పాత సత్యలక్ష్మి, బైరి సతీష్ ముదిరాజ్; అలాగే ఆలయ కమిటీ సభ్యులు కందుల క్రాంతి కుమార్, భివండి శ్రీనివాస్, నరేష్, మైలారం రాము తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి

## డీఎంహెచ్‌వో డా.పుట్ల శ్రీనివాస్
## నిరంతరం వైద్య సేవలు అందించాలి



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్** : వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రజలకు నిరంతరం మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆయన మంగళవారం జాంబాగ్‌పార్క్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నిఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా డీఎంహెచ్‌వో సిబ్బంది హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, లాబొరేటరీ కేంద్రాన్ని, వివిధ రికార్డులను మరియు ఆసుపత్రిలోని పరిశుభ్రత పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గర్భిణీ స్త్రీల సంరక్షణ, శిశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అంటువ్యాధుల నివారణకు, ముఖ్యంగా మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అందించే ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడైన పేదవాడికి చేరేలా సిబ్బంది అందరూ అంకితభావంతో కృషి చేయాలని ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో ఎస్పీహెచ్‌వో బిర్జిస్ ఉన్నిసా, వైద్యాధికారి తరుణి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




# రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్
- ఆషాఢ మాస బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్** : ఆషాఢ మాస బోనాల పండుగను పురస్కరించుకుని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ నగరంలో పలు అమ్మవార్ల ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలో గొల్లకిట్టు ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయాన్ని ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాంనగర్ గుండు ప్రాంతంలో అఖిల్ పైల్వాన్ గారి ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన.. బంగారు ముత్యాలమ్మ తల్లిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలందరికీ అమ్మవార్ల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.